పండుగలు ప్రశాంతంగా నిర్వహించాలి

- గణేశ్ మండపాలకు అనుమతి ఉండాలి
- శాంతి సమావేశంలో ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో నిర్వహించే వివిధ పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, అలాగే సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మకూడదని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ రాందాసు తేజావత్ ఆధ్వర్యంలో వివిధ మతాలకు చెందిన పెద్దల సమక్షంలో సోమవారం శాంతి సమావేశాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒక మతం వారు ఇంకో మతం వారిని గౌరవించుకుంటూ జీవనం సాగించే సంస్కృతి జిల్లాలో పటిష్టంగా ఉందన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా అన్ని పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఎక్కడైనా చిన్న, చిన్న ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసుకు సమాచారం ఇచ్చి సహకారమందించాలని ఎస్పీ కోరారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవాలయాలు, చర్చీలు, మసీదుల ప్రాంతాల్లో ఆయా మతాల పెద్దలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించుకోవాలన్నారు. గణేశ్ ఉత్సవాలకు సంబంధించి మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవో పద్మావతి, డీఎస్పీ వెంకటేశ్వర్ రావు, డీపీవో రామ్మూర్తి, సీఐ నాగభూషణ్ రావు, ముని నాయుడు, మతపెద్దలు పాల్గొన్నారు.

శాంతి సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

గంగమ్మ తల్లికి పూజలు చేసిన మాజీ మంత్రి

మర్రికుంట చెరువు వద్ద మాజీ మంత్రితోపాటు నాయకులు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 2 : జిల్లా కేంద్రంలోని మర్రికుంట చెరువు అలుగు పారడంతో సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అన్యాక్రాంతమవుతున్న చెరువులను పునరుద్ధరించడంతో నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, వాగులు జలకళను సంతరించున్నాయన్నారు. ఆనాడు మర్రికుంట చెరువు అన్యాక్రాంతమై కంపచెట్లతో నిండుకొని ఉండేదని, చెరువు చుట్టూ కరకట్ట నిర్మించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్లు చేసి పట్టణానికి రహదారిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెరువు పునరుద్ధరణతో దిగువ ప్రాంతాలకు ముప్పు కలుగకుండా ఉందని మంత్రికి మర్రికుంట ప్రాంత వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, కన్వీనర్ నందిమల్ల అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు మాణిక్యం, సింగిల్‌విండో అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సంపత్‌కుమార్, కురుమూర్తి, తిరుపతయ్య, రాము, నర్సింహ, మర్రికుంట శ్రీను, నాగేంద్రం, బాబునాయక్ ఉన్నారు.

పలువురికి పరామర్శ

కార్యకర్తలకు కష్టం వస్తే కడుపులో దాచుకొని ఆదుకుంటానని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం పలువురు కార్యకర్తలు, నాయకులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆంజనగిరికి చెందిన మలిదశ ఉద్యమకారుడు దేవన్న నాయుడు, జిల్లా కేంద్రానికి చెందిన నందిమల్ల రమేశ్ ఇండ్లకు వెళ్లి పరామర్శించారు. అలాగే శ్రీరంగాపురం గ్రామానికి చెందిన ముబిన్ మృతిచెందగా.. పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రివెంట గట్టుయాదవ్, అశోక్, మాణిక్యం, మహేశ్వర్‌రెడ్డి, వెంకటస్వామి, రాములు, జగన్నాథనాయుడు, మాజీ జెడ్పీటీసీ పద్మ తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి పల్లకీసేవ

ఎక్లాస్‌పురంలో పల్లకీని మోస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ రూరల్, సెప్టెంబర్ 2: మండలంలోని ఎక్లాస్‌పురంలో సోమవారం ప్రబోధసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణుడి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు పాల్గొని ఉత్సవ పల్లకీని మోశారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు నిండుకుండ బిందెలతో స్వాగతం పలుకుతూ హారుతులు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతిఒక్కరికీ శ్రీకృష్ణుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, రంగారెడ్డి,గ్రామస్తులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

చేనేత కార్మికులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, సెప్టెంబర్ 2 : చేనేత కార్మికులకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.4.75కోట్ల విలువ గల త్రిఫ్టఫండ్ చెక్కులను చేనేత కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ అయ్యప్పురెడ్డి, ఏడీవో రాజేశ్వర్‌రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, జౌళిశాఖ అధికారి గోవిందయ్య , చేనేత సంఘం నాయకులు అక్కల శాంతారాం, సురేశ్, కరుణాకర్, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత..

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గట్టు మండలంలోని రాయపురం గ్రామానికి చెందిన ఐశ్వర్యకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, నాగన్న పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు జారీ



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడుతున్న ఎంఈవో నర్సింహులు

అయిజ, సెప్టెంబర్ 2: ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాలను దిక్కరించి తరగతులను నడిపిన ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు ఎంఈవో నర్సింహులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీకృష్ణవేణి, బీజీఆర్, నవభారత్, జీవీఆర్ఎం, న్యూ గీతాంజలి పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారని సోషల్ మీడియాలో వీడియోలు, ఫొటోలు వైరల్ కావడంతో కలెక్టర్, డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో పాఠశాలలను తనిఖీ చేశారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ నిబంధనలు దిక్కరించి తరగతులు నిర్వహించడంలో ఆంతర్యమేమిటని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను ఎంఈవో ప్రశ్నించారు. ఎమ్మార్సీ కార్యాలయానికి ఆయా పాఠశాలల యాజమాన్యాలను పిలిచి నోటీసులు జారీ చేశామని తెలిపారు. నోటీసులకు తక్షణమే వివరణ ఇవ్వాలని, వివరణలు కలెక్టర్, డీఈవోకు పంపుతామని పేర్కొన్నారు. వానలు కురుస్తున్న సమయంలో ప్రభుత్వం పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినప్పటికీ తరగతులు నిర్వహించడంతో ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు ఎంఈవో వెల్లడించారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శాంతిరాజు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సభ్యులు పాల్గొన్నారు.

ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలి

గద్వాల, సెప్టెంబర్ 2 : రోగుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరులతో దోచుకుంటున్న ప్రైవేట్ ల్యాబ్‌ల గుర్తింపు రద్దు చేసి రెఫర్ చేసే డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింహ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరావుకు సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం బృందం జిల్లా కేంద్రంలోని వెన్నెల బిందుసాగర్, ఆదిత్య, రాఘవేంద్ర, సాయికృప, పెంచలయ్య, ప్రవంతి, ఎస్ఎస్, నిధి, విజయ, అపిల్, యూవీ, ఎస్ఎంఎన్, విజయభాస్కర్‌రెడ్డి ల్యాబ్‌లను సందర్శించి రోగులతో మాట్లాడితే ల్యాబ్‌ల దోపిడి పర్వం తెలిసిందన్నారు. డెంగీ టెస్ట్ కిట్ కేవలం రూ.200లోపే ఉండగా ప్రైవేట్ ల్యాబ్‌ల వారు మాత్రం రూ.1200 నుంచి రూ.1500 వసూలు చేస్తున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో సీపీఎం నాయకులు రాజు, శివకృష్ణ, వీరేశ్, ఆంజనేయులు, బలరాం, శివ ఉన్నారు.

మరో మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 2 : జిల్లాలో భారీ వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా మరో రెండు, మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో అన్ని మండలాల ప్రత్యేక అధికారులతో వీసీ నిర్వహించి వర్షాల వల్ల జరిగే నష్టాలు, ప్రస్తుతం అత్యవసరంగా చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వర్షాల వల్ల ప్రభావితమైన రోడ్లు, కాల్వల మరమ్మతు చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటి వరకు జరిగిన నష్టాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి రేపటి సాయంత్రంలోగా అందజేయాలని సూచించారు. రోడ్ల పునరుద్ధరణ, కాల్వల మరమ్మతులు వేగం చేయాలని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి అందులో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అవసరమైన వాటికీ నోటీసులు ఇచ్చి కూలగొట్టాలన్నారు. కూలిపోయిన ఇండ్ల యజమానులు దరఖాస్తు చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో పంచనామా, జీపీఎస్ ఫొటోలు తీసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ సూచించారు. ఇక నుంచి మంగళ, శుక్రవారం రెండు రోజుల పాటు డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. అదేవిధంగా స్థానిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సెప్టెంబర్ 10న అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేశ్, ఆర్డీవో పద్మావతి, తాసీల్దార్లు, ఎంపీడీవోలు ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు

గద్వాల రూరల్, సెప్టెంబర్ 2 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించి వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. పుటాన్‌పల్లి దగ్గర ఉన్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి వారికి తగిన మందులను అందజేయాలన్నారు. అదే విధంగా పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచి నీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, డాక్టర్ జయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 2 : జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని నెలరోజులపాటు (సెప్టెంబర్ 30) వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రావుల గిరిధర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు.

ఓటరు వార్డు నమోదు పరిశీలన

ఉండవెల్లి, సెప్టెంబర్ 2: గ్రామపంచాయతీలకు త్వరలో నిర్వహించనున్న స్థానికల ఎన్నికలలో ఒకే కుటుంబ ఒకే వార్డులో ఓటును వినినియోగించుకునే విధంగా పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండడంతో డీపీవో శ్యామ్‌సుందర్, ఎంపీడీవో తిరుపతన్నతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిస్థాయిలో ఆ కుటుంబ సభ్యులు ఒకే వార్డులో ఓటుహక్కు ఉండేవిధంగా చూడాలన్నారు. ఓటరు, వార్డు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

చిన్నోనిపల్లిని సందర్శించిన మాజీ జెడ్పీచైర్‌పర్సన్

గట్టు, సెప్టెంబర్ 2 : మండలంలోని చిన్నోనిపల్లిని మాజీ జెడ్పీచైర్‌పర్సన్ సరిత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నిర్వాసితులు వర్షాలతో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

పరమేశ్వరుడిని ముంచెత్తిన గంగ

కొత్తకోట,సెప్టెంబర్ 2 : మండలంలోని పామాపురం గ్రామ సమీపంలోని ఊక చెట్టు వాగు వద్ద నిర్మించిన చెక్ డ్యాం వద్ద వరద ఉధృతి ఉగ్రరూపం దాల్చింది. రామన్‌పాడు నుంచి 11గేట్లు ఎత్తడంతో శివుని విగ్రహం పీఠాన్ని ఎక్కి వరద ప్రవహిస్తున్నది. అక్కడ ఉన్న మూడుబోట్లు కొట్టుకోపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

శివుడి విగ్రహానికి తాకుతూ ప్రవహిస్తున్న వరద

శంకరసముద్రం 5 గేట్లు ఎత్తివేత

కొత్తకోట, సెప్టెంబర్ 2 : ఎగువ నుంచి భారీగా వరద శంకరసముద్రం రిజర్వాయర్‌లోకి వస్తుడడంతో ఆదివారం సాయంత్రం రిజర్వాయర్ 5 గేట్లను ఎత్తారు. అలాగే వరద కొనసాగడంతో సోమవారం సాయంత్రం వరకు దిగువకు 7500 క్యూసెక్కుల నీటిని వదులు తుండగా ఇన్‌ఫ్లో 6500 క్యూసెక్కుల నమోదైనట్లు ఏఈ అఖిల్ తెలిపారు.

ఐదు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

ఎంజేకేఎల్ఐ కాల్వకు మరమ్మతులు

పాన్‌గల్, సెప్టెంబర్ 2: భారీ వర్షాల కారణంగా మండలంలో ఎంజేకేఎల్ఐ డిస్ట్రిబ్యూటర్–8 కాల్వలో అంతర్భాగమైన మేజర్–6 కాల్వ మండలంలోని శాగాపూర్, మాధవరావుపల్లి గ్రామాల్లో కోతకు గురైంది. దీంతో జిల్లా ఇరిగేషన్ అధికారి మధుసూదన్‌రావు ఆదేశాల మేరకు మాజీ ఎంపీటీసీ సుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో రైతులు జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో కేఎల్ఐ కాల్వకు మట్టిని పోసి మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనువాసులు, రైతులు పాల్గొన్నారు.

తాటికుంట రిజర్వాయర్ పరిశీలన

మల్దకల్, సెప్టెంబర్ 2 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండంలోని తాటికుంట రిజర్వాయర్ మట్టి కట్ట కోతకు గురైంది. విషయం తెలుసుకున్న జెడ్పీ సీఈవో కాంతమ్మ రిజర్వాయర్‌ను ఎంపీడీవో ఆంజనేయ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో కట్ట నాలుగు చోట్ల కోతకు గురైందని విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు వివరించామన్నారు. రేపటి నుంచి పనులు మొదలు పెట్టి మరమ్మతులు చేస్తామని ఇరిగేషన్ డీఈ తెలిపినట్లు ఆమె తెలిపారు. దీని వలన రిజర్వాయర్‌కు ఎలాంటి ముప్పులేదని ఆమె వివరించారు. ఆమె వెంట సీసీ బుడ్డన్న ఉన్నారు.

తాటికుంటను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో కాంతమ్మ

వరదను పరిశీలించిన మక్తల్ ఎమ్మెల్యే

అమరచింత, సెప్టెంబర్ 2: మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని జూరాల ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద ఆవడంతో సోమవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులను వరద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమరచింత పట్టణంలో భారీ వర్షాలతో కూలిపోయిన ఇండ్లను పరిశీలించి బాధితులకు ఓదార్చి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పెద్ద చెరువు నిండి అలుగుపారండంతో రైతులతో కలసి చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రహీమతుల్లా, మశ్చందర్, పరమేశ్, గంగాధర్‌గౌడ్, అయ్యూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ ఉన్నారు.

మర్రికుంట అలుగును పరిశీలించిన ఎమ్మెల్యే

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 2: జిల్లా కేంద్రంలోని 9వ వార్డులోని మర్రికుంట చెరువు అలుగు పారడంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి సోమవారం పరిశీలించారు. చెరువు అలుగు ద్వారా వచ్చే నీరు రోడ్లపై ప్రవహిస్తుందని, నీటిని నాలా ద్వారా సాఫీగా వెళ్లేలా చూడాలని మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశించారు. అలాగే కలెక్టరేట్ ప్రధాన రహదారిపై నీరు ప్రవహించడాన్ని ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ మహేశ్, బాషానాయక్, నారాయణ, చీర్ల సత్యంసాగర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ముసురు వర్షానికి కూలిన ఇండ్లు

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 2 : ఇటీవల వర్షాలకు మండల కేంద్రంతోపాటు మామిడిమాడ, మానాజీపేట, కమాలుద్దీన్‌పూర్, సూరాయపల్లి తదితర గ్రామాల్లో పాత ఇంటి గోడలు తడిసి మొత్తం 14 ఇండ్లు కూలిపోయాయి. ఇండ్లు కూలిపోయిన బాధితులు తాసీల్దార్ పాండునాయక్‌కు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. కూలిన ఇండ్లను పరిశీలించి పంచనామా నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తాసీల్దార్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు నిండి అలుగులు పారుతున్నాయి.

విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు

మండలంలోని గ్రామాల్లో విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్లను సోమవారం విద్యుత్ శాఖ అధికారులు జేసీబీల సాయంతో తొలగించారు. చెట్లు వైర్లకు తగిలితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అందులో భాగంగానే ముందస్తు జాగ్రత్తగా చెట్లను తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వనపర్తి మండలంలో కూలిన 5ఇండ్లు

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 2 : మండలంలోని కడుకుంట్లగ్రామంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 5ఇండ్లు కూలినట్లు మాజీ సర్పంచ్ బాలకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన వారాల గోవిందమ్మ, సంద బుచ్చమ్మ, చింతకాయల రాములు, ఎం.సంజీవరెడ్డి , బ్యాండ్ సాయులు ఇండ్లు భారీ వర్షాలకు కూలినట్లు చెప్పారు.

పాక్షికంగా దెబ్బ తిన్న ఇండ్లు..

కొత్తకోట, సెప్టెంబర్ 2 : ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో ఐదు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తాసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. నాటవెల్లి–1, చర్లపల్లి–1, కనిమెట్ట–1, వడ్డెవాటలో –2 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లను సోమవారం తాసీల్దార్‌తో పాటు ఆర్ఐ పరిశీలించారు.

పాన్‌గల్‌లో 9 ఇండ్లు..

పాన్‌గల్, సెప్టెంబర్ 2: భారీ వర్షాల కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో 9ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు ఎంపీడీవో రఘురాములు సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలో 1 అన్నారంలో 2, బుసిరెడ్డిపల్లిలో 2, రేమద్దులలో 3, కొత్తపేటలో 1 పాక్షికంగా ఇండ్లు దెబ్బతిన్నాయి.

కడుకుంట్లలో వర్షాలకు కూలిన ఇండ్లు

అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, సెప్టెంబర్ 2 : నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శ్రీహరి సూచించారు. మూడురోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు గానూ సోమవారం ఎమ్మెల్యే మండలంలోని జూరాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఏఏ గ్రామాల్లో ఎన్ని ఇండ్లు పడిపోయాయి, పంట నష్టం విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పరమేశ్, మొగిళి గంగాధర్‌గౌడ్, రహమతుల్లా, శ్రీనివాసులు, తిరుపతయ్యగౌడ్, మహ్మద్, నర్సింహ, వెంకటన్న పాల్గొన్నారు.

అధికారులు పట్టించుకోవాలి

కేటీదొడ్డి, సెప్టెంబర్ 2 : మండలంలోని గువ్వలదిన్నెలో గుడిసె కూలి ఓ కుటుంబం రోడ్డున పడింది. గ్రామానికి చెందిన దుబ్బన్న భార్య కూతురుతో కలిసి చిన్న గుడిసెలో జీవిస్తున్నాడు. శనివారం కురిసిన భారీ వర్షానికి గుడిసె చుట్టూ గోడలు పడిపోవడంతో ఆ కుటుంబం దిక్కులేని స్థితిలో పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

ఇటిక్యాల, సెప్టెంబర్ 2: తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువనుంచి భారీగా వచ్చి చేరుతున్న వరద నీటితో బీచుపల్లి పుష్కరఘాట్ చెంత పుష్కరిణి విగ్రహం ముంచెత్తుతూ శివాలయం మెట్లదాకా ప్రవాహవేగంతో దిగువకు ప్రవహిస్తోంది. ప్రస్తుతం నదిలో 4లక్షల18వేలకు పైగా క్యూసెక్కులు వచ్చి చేరుతుందని, ఒకటి రెండు రోజులు ఇదే ప్రవాహం రానుందని అధికారులు చెబుతున్నారు.

మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించాలి

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, సెప్టెంబర్ 2 : మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రకృతిని కాపాడటంలో ప్రజలు ముందుడుగు వేయాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన మట్టి గణేశ్ విగ్రహాల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీవోపీ విగ్రహాలకు బదులు పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను వినియోగించాలన్నారు. వినాయక చవితిని పర్యావరణ రహిత పండుగగా నిర్వహించుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ ఏడాది తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి 8అంగుళాల మట్టి గణపతి విగ్రహాలు అందించి పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో రాంచందర్, అధికారులు భద్రప్ప, నరేశ్, కాలుష్యమండలి నియంత్రణ అధికారి సోమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ సంతోష్

నీలిపల్లిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

మల్దకల్, సెప్టెంబర్ 2 : మండలంలోని నీలిపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని గ్రామస్తుల ఫిర్యాదుతో ఏఈ దుర్గాప్రసాద్ సోమవారం గ్రామానికి చేరుకొని పరిశీలించారు. వెంటనే లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రాములు, అసిస్టెంట్ లైన్‌మెన్ వీరేశ్‌లను పిలిపించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు.

వర్షానికి కొట్టుకుపోయిన వరి పంట

ఖిల్లాఘణపురం, సెప్టెంబర్ 2 : మండలంలోని కురిసిన భారీ వర్షాలకు మల్కినియాన్‌పల్లి గ్రామానికి చెందిన కప్పుట చెన్నయ్య వరి పంట కొట్టుకుపోయింది. చెన్నయ్య ఇటీవలే ఎకరం 30గుంటల్లో వరినాటు వేశాడు. మూడురోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి పంట పూర్తిగా కొట్టుకుపోయినట్లు రైతు చెప్పాడు. విషయాన్ని వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం ఏఈవో పవన్‌కల్యాణ్ పంచనామా నిర్వహించి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

జాతీయస్థాయిలో ఉద్యాన విద్యార్థి ప్రతిభ

పెద్దమందడి, సెప్టెంబర్ 2 : మండలంలోని మోజర్ల ఉద్యాన కళాశాల థర్డ్ ఇయర్ విద్యార్థి ఎన్.నరేశ్ జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించినట్లు కళాశాల వైస్ చాన్స్‌లర్ నీరజా ప్రభాకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడపలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ టార్గెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి పతకం గెలవడం అభినందనీయమన్నారు. అనంతరం వర్సిటీ డీన్ డాక్టర్ మర్రి రాజశేఖర్, అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, ప్రొఫెసర్లు , నరేశ్‌ను అభినందించారు.

పతకం సాధించిన ఉద్యాన కళాశాల విద్యార్థి నరేశ్

వనపర్తి జిల్లాలో అత్యధిక వర్షపాతం

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 2 : జిల్లావ్యాప్తంగా సగటున 42 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వనపర్తి జిల్లా కేంద్రంలో 67.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా వీపనగండ్లలో 31.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అమరచింతలో 31.8, మదనాపురంలో 46.0, పెద్దమందడిలో 50.2, ఖిల్లాఘణపురంలో 42, గోపాల్‌పేటలో 36, రేవల్లిలో 59.6, పాన్‌గల్‌లో 49.4 , కొత్తకోటలో 38.4, ఆత్మకూరులో 27.4, పెబ్బేరులో 38.2, శ్రీరంగాపురంలో 36.2, చిన్నంబావి మండలంలో 34.2మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

శిథిలావస్థ ఇండ్లు కూల్చివేత

శిథిలావస్థ ఇంటిని కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

అయిజ, సెప్టెంబర్ 2: పట్టణంలోని శిథిలావస్థలో ఉన్న ఇండ్లను యజమానుల సమ్మతితో కూల్చివేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దేవన్న తెలిపారు. సోమవారం పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను తాసీల్దార్ జ్యోతితో కలిసి చైర్మన్ పరిశీలించారు. పట్టణంలో అత్యంత ప్రమాదకరంగా ఉన్న 38ఇండ్లను గుర్తించగా, పూర్తిగా శిథిలమైన మూడు ఇండ్లను మున్సిపాలిటీ అధికారుల సహకారంతో నేలమట్టం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 38 ఇండ్లలో నివాసముంటున్న ప్రజలు బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోకి చేరుకోవాలని అవగాహన కల్పించారు. పునరావాస కేంద్రంలో మూడు రోజులు భోజన వసతి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలు పునరావాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ గోపాల్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొసలి పట్టివేత

ఆత్మకూరు, సెప్టెంబర్ 2: ఆత్మకూరు పట్టణంలోని మొదటివార్డు ఖానాపూర్‌లోని కాల్వలో మొసలి కనబడడంతో కాలనీకి చెందిన యువకులు దానిని బంధించి గ్రామంలోకి తీసుకొచ్చారు. కౌన్సిలర్ చెన్నయ్య సాయంతో అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. మొసలిని పట్టుకొని ఫోటోలు దిగుతూ సంబురపడ్డారు.

మొసలితో యువకులు

కొండచిలువను కాపాడిన పోలీసులు

కొండచిలువతో పోలీసులు

ఆత్మకూరు, సెప్టెంబర్ 2 : ప్రమాదంలో చిక్కుకున్న కొండచిలువను పోలీసులు కాపాడారు. ఆత్మకూరుకు చెందిన రాము మేకలు వ్యవసాయ బావిలో పడకుండా చేపలవలను చుట్టాడు. సోమవారం ఆ చేపల వలకు కొండచిలువ చిక్కుకుంది.గుర్తించిన రైతు రాము డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. బ్లూకోర్టు విధుల్లో ఉన్న బాలేశ్వర్‌రెడ్డి, బాలరాజు జిల్లా కేంద్రంలోని స్నేక్ సొసైటీ ప్రతినిధి కృష్ణసాగర్ సహాయంతో ఆ కొండచిలువను బయటకు తీశారు. కొండ చిలువను సురక్షితంగా అటవీప్రాంతంలో వదిలిపెట్టనున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు.